శ్రీవారి ఆలయంలో దర్శనం ప్రారంభం

ముగిసిన చంద్ర గ్రహణం

ఉదయం 8.30 నుండి

యధావిధిగా అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: శ్రీవారి ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటల నుండి భక్తులకు దర్శనం ప్రారంభమైంది. ఆదివారం రాత్రి 9.50 నుండి 1.31 గంటల వరకు చంద్ర గ్రహణం ఉన్న కారణంగా ముందుగా నిర్ణయించిన ప్రకారం సాయంత్రం 3.30 గంటలకు ఆలయం తలుపులు మూశారు.దాదాపు

2 లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 9 సెప్టెంబరు 2025 8 పేజీలు

ఎరువుల దొంగ నిల్వలను అరికట్టాలి

రైతులకు ఎరువులు, మందులు సకాలంలో సబ్సిడీతో అందించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య డిమాండ్

విశాలాంధ్ర - తిరుపతి : రైతే దేశానికి వెన్నుముక అన్నమాట పాలకులకు నిజమైతే రాష్ట్రంలో రైతులకు సకాలంలో ఎరువులు మందులు సబ్సిడీతో అందించి ఎరువుల దొంగ నిల్వలను నివారించి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తిరుపతి నగర్ సమితి ఆధ్వర్యంలో ఎరువుల కొరత తీర్చాలంటూ ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ అధికారం కోసం రైతు సంక్షేమం రైతు రాజ్యం అంటూ పేపర్లకు ప్రకటనలిస్తు అధికారం వచ్చిన తర్వాత కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ఉన్న భూమిని అంతా పరిశ్రమల పేరుతో ధారాధత్వం చేయ డానికి కూటమి ప్రభుత్వం ఉన్నది తప్ప రైతుల సంక్షేమం

2 లో

యూరియా నిల్వ చేస్తున్న యజమానులపై చర్యలు చేపట్టాలి

సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు డిమాండ్

విశాలాంధ్ర - చిత్తూరు: రైతులకు యూరియాను సకాలంలో అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యానికి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం చిత్తూరు తహసిల్దార్ కార్యాలయం ముందు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు, సిపిఐ సహాయ కార్యదర్శి కే.శివారెడ్డి లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం మంది రైతులు వరి పంట పై ఆధారపడి ఉన్నారని ఖరీఫ్ సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు ఇబ్బం దులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షపాతి అని చెప్పుకొనే కూటమి ప్రభుత్వం రైతులకు యూనియన్ యూరియా పంటకు సకాలంలో ఎందుకు సరఫరా చేయలేదు చెప్పాలన్నారు. కొంతమంది వ్యాపారలు నిల్వ ఉంచి ధరలను

2 లో

పంటలకు సరిపడినంత యూరియాను అందజేయాలి

సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పంటలకు సరిపడినంత యూరియాను రైఉతలకు అందజేయాలని సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమై అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి యూరియాను రాష్ట్రానికి తీసుకో రావడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఎరువులు పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని వారి లైసెన్సులు రద్దు చేయాలని రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందించాలని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసి రైతులకు అండగా నిలబడతామన్నారు. అనంతరం ఇంచార్జ్ ఎంపీడీవోకి వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి జనమాలు గురవయ్య

2 లో

ప్రకృతి సంపద పరులపాలు.!

- నియమ నిభందనలు గాలికి..
- మైన్స్ శాఖలో ఆనలుగురే ఉద్యోగులు
- కట్టడికి తప్పని కష్టాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కూటమి ప్రభుత్వ చర్యలు అమలయ్యేనా

విశాలాంధ్ర-వెదురుకుప్పం:

ప్రకృతి సంపద పరుల పాలవుతోంది. యథేచ్ఛగా ఇసుక,ఎర్రమట్టి, గ్రానైట్ అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలింపు. నియమ నిభందనలు గాలికి..ఖనిజ సంపద తవ్వకాలు, తరలింపు లో ప్రభుత్వ ఆదాయం కు జమ చేసే శాఖ మైన్స్ కార్యాలయంలో నలుగురే ఉద్యోగులు.పనిభారం తో ఆశాఖ లక్ష్యం పక్కదారి.ప్రభుత్వ ఆదాయం కు గండిపడుతున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

2లో

టీటీడీ ఈఓగా అనిల్ కుమార్ సింఘాల్



విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : ఆంధ్రప్రదేశ్‌లో 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. టీటీడీ ఈఓ శ్యామలరావును బదిలీ చేసింది. ఆయన స్థానంలో టీటీడీ ఈఓగా అనిల్ కుమార్ సింఘాల్‌ను నియ మించారు. శ్యామలరావును సాధారణ

2 లో

దర్శనం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి) 12 గంటల అనంతరం సోమవారం ఉదయం 3 గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

అన్నప్రసాద వితరణ ప్రారంభం: చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూసివేసిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సును 7.30 గంటలకు తెరిచారు. వంటశాల శుద్ధి అనంతరం ఉదయం 8.30 గంటల నుండి భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది.

రైతులకు ఎరువులు, మందులు సకాలంలో సబ్సిడీతో అందించాలి

(మొదటి పేజీ తరువాయి) పట్టించుకోవడం లేదన్నారు యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న యూరియాను రైతులకు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టకపోవడం దారుణం అన్నారు గత రెండు మూడు నెల క్రితమే దళారీలకు ఎరువులను అమ్మేసి నేడు ఎరువుల దొంగలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని దానివల్ల రైతాంగానికి సకాలంలో ఎరువులు అందక పంటలు పండించుకోలేక రైతాంగం దివాలా తీసే పరిస్థితి వస్తుందని ఆయన సూచించారు పంటలు పండక పోవడం పండిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యకు దారితీస్తున్నాయని అన్నారు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి తక్షణమే ఎరువుల కొరతను తీర్చి రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం సిపిఐ బృందం జాయింట్ కలెక్టర్ గారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె రాధాకృష్ణ, బండి చలపతి, రైతు సంఘం నాయకులు బి శ్రీనివాసులు, గోవింద స్వామి, కె పద్మనాభ రెడ్డి, ఎం రామకృష్ణ, డి రామచంద్రయ్య, చిన్నం కాలయ్య, నాగభూషణం, మహేంద్ర, శ్రీనివాసులు, ఎల్ కె నాయుడు, రాము, ఎన్ మంజులు, సి.రత్నమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వ చేస్తున్న యజమానులపై చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి) పెంచి బ్లాక్లో అమ్ముకోవడానికి చూస్తున్నారని దీనివలన రైతులు ఇబ్బంది పడే పరిస్థితి వస్తున్నదని వాపోయారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులను సమీకరించి ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ఉద్యమ చేపట్టవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు నిరసన అనంతరం డిప్యూటీ తాసిల్దార్ కు సిపిఐ నాయకత్వం వినతి పత్రం సమర్పించారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వి.సి గోపీనాథ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. కోదండయ్య ,దాసరి చంద్ర, కె.విజయ గౌరీ, కే. రమాదేవి, బి కుమారి,పెద్ది రెడ్డి కవిత, ఎం విజయ్ కుమార్,హెచ్. బాలాజీ రావు కే.లతా,పి. రఘు ఏ.జమీలాభి, హెచ్.ఫైరోజ్, యస్. ఆముద, ముత్తు,రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సరిపడినంత యూరియాను అందజేయాలి

(మొదటి పేజీ తరువాయి) మండల కార్యదర్శులు మంచెల శివకుమార్ శ్రీనివాసులు పట్టణ కార్యదర్శులు గోపి పట్టణ నాయకులు అయ్యప్ప, మురళి, జనార్దన్ ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షులు చారుశీల, రైతులు మణి, రామ్మూర్తి కృష్ణయ్య, గురప్ప, సత్య, సాంబ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈఓగా

అనిల్ కుమార్ సింఘాల్

(మొదటి పేజీ తరువాయి) పరిపాలన శాఖ కార్య దర్శిగా నియమించారు. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శిగా అనంత్‌రామ్‌ను బదిలీ చేశారు. రెవెన్యూశాఖ (ఎండోమెంట్) కార్యదర్శిగా ఎం.హరి జవహర్‌లాల్‌ను నియమించారు. ఆ స్థానంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వాడ్రేవు వినయ్ చంద్‌ను రిలీవ్ చేసింది. అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండేను నియమించింది. మైనార్టీ, సంక్షేమ శాఖ కార్య దర్శిగా సీహెచ్ శ్రీధర్ ను బదిలీ చేసింది. ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అండ్ ఇన్సురెన్స్, మెడికల్ సర్వీసెస్ కార్యదర్శిగా ఎం.వి.శేషగిరి బాబు బదిలీ చేసింది. ఆయనకు లేబర్ కమిషనర్‌గా అదనపు బాధ్య తలు అప్పగిం చారు.ఇక వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్య దర్శిగా ఉన్న ఎమ్. టీ. కృష్ణబాబును. రోడ్లు, భవ నాలు శాఖ ముఖ్య కార్యదర్శిగా నియ మించారు. అలాగే పెట్టుబడులు, మౌలిక సదుపా యాలు శాఖకు స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆరోగ్య శాఖ కార్యదర్శిగా సౌరవ్ గౌర్‌ను బదిలీ చేశారు. ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేష్ కుమార్ మీనాను నియమించారు. ఆయనకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్‌ను బదిలీ చేశారు. అయితే అనిల్ కుమార్ సింఘాల్.ఈ బదిలీతో మరోసారి టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం ఐఏఎస్ బదిలీలు చేపట్టింది. ఆ సమయంలో సైతం అనిల్ కుమార్ సింఘాల్‌ను టీటీడీ ఈవోగా బదిలీ చేసింది. నాటి నుంచి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల వరకు అనిల్ కుమార్ సింఘాల్ అదే పదవిలో కొనసాగిన సంగతి తెలిసిందే.

ప్రకృతి సంపద పరులపాలు..!

(మొదటి పేజీ తరువాయి) అసలేం జరుగుతుందంటే : చిత్తూరు జిల్లా పరిధిలో అన్ని మండలాల్లో సుమారు 600 క్వారీలు నిర్వహణ లో ఉన్నాయి.ఈక్రమంలో ఇసుక,మట్టి,గ్రానైట్, కంకర తదితర క్వారీలు ఉన్నాయి.వీటి నిర్వహణ పరిధిలో మైన్స్ ఆధ్వర్యంలో నియమనిభందనలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి తగుచర్యలు తీసుకోవాల్సిన బాధ్యతలు మైన్స్ శాఖకు ఉంది.తవ్వకాలకు అనుమతులు మంజూరు మొదలు తరలింపు వరకు పర్యవేక్షణ ఉండి ప్రభుత్వానికి రాయల్టీ,ఇతర పన్నులు ప్రభుత్వ ఖజానాకు జమ చేసే బాధ్యతలు ఆశాఖకు ఉంటాయి.కానీ అభివృద్ధి పనుల పేరుతో ప్రకృతి సంపదను కొన్ని చోట్లనిబంధనలు ఉల్లంఘించి అక్రమార్కుల ద్వారా పక్కరాష్ట్రాలకు తరలిపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో జిల్లాలో పలు నియోజవర్గాల్లో అక్రమ తరలింపులపై ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్న దుస్థితి మీడియా వేదికగా నిత్యం చక్కర్లు కొడుతున్నాయి.కొన్ని చోట్ల నిబంధనలు పాటించని క్వారీ యజమానులకు,స్థానిక ప్రజానీకానికి గొడవలు,ఘర్షణలు కొనసాగుతున్న పరిస్థితులు కోకొల్లలు గా వున్నాయి.ఉదాహరణకు జీడి నెల్లూరు నియోజకవర్గంలో వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీ బందార్లపల్లి పరిధిలో ఓ గ్రానైట్ క్వారీ ఏర్పాటు వద్ద గ్రామస్తులకు,క్వారీ నిర్వాహకులకు మధ్య కొట్లాటలు జరిగి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు ఆసుపత్రి పాలైన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పాలసముద్రం మండలంలో సోమవారం అక్రమంగా ఎర్రమట్టి తరలింపు అడ్డుకుని రికార్డులు చూపమన్న ఎస్సై చిన్న రెడ్డప్ప కు క్వారీ నిర్వాహకులకు స్థానిక తహశీల్దార్ అరుణకుమారి సమక్షంలో వాగ్వాదం చోటుచేసుకుంది.ఇదంతా అధికారుల సమన్వయలోపం వల్లే అక్రమాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.ఖనిజ సంపద తవ్వకాలు, తరలింపు ద్వారా కోట్లరూపాయిలు రాయల్టీ,జీఎస్టీ ప్రభుత్వం ఖజానాకు జమకావాల్సివుంది.ఇందులో కీలకమైన పాత్ర పోషించాల్సిన మైన్స్ శాఖలో నలుగురే ఉద్యోగులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.మైన్స్, రెవెన్యూ,పోలీస్,స్థానికులు సమన్వయంతో అనుమతులు మంజూరు చేస్తే అక్రమాలకు తావుండే పరిస్థితి ఉండదని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.వీరందరి సమన్వయం కొరవడడం తో అక్రమార్కుల దందా మూడు పువ్వులు ఆరుకాయలు లా సాగుతోంది.ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం లో అక్రమ రవాణా పై దృష్టి సారించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదే అంశానికి సంబంధించి మైన్స్ డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా ఈ శాఖలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే.ప్రస్తుతం డీడీ,జియాలజిస్ట్, రాయల్టీ ఇన్స్పెక్టర్,టెక్నికల్ అసిస్టెంట్ లు కలసి నలుగురు మాత్రమే ఫీల్డ్ ఉద్యోగులు వున్నారు.600 క్వారీలు ఉన్న నేపథ్యంలో కొంత పనిభారం ఉంటుందని వివరించారు.ఫిర్యాదులు వస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళా భద్రత, బాలికల రక్షణపై

ప్రత్యేకదృష్టి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎన్. వెంకటేశ్వర్ అధ్యక్షతన ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మిషన్ శక్తి క్వార్టర్లీ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కలెక్టర్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ మిషన్ శక్తి కార్యక్రమాల ప్రగతి సమీక్ష, భవిష్యత్తు కార్యాచరణలపై చర్చించేందుకు ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, ఏడి డిజైనబుల్ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, సీఈఓ డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ డెవలప్మెంట్, డీఈఓ ఆఫీస్ సిబ్బంది, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి పథక లక్ష్యాలపై సమగ్రమైన వివరణ సమర్పించి, గత త్రైమాసికంలో చేపట్టిన ప్రగతి, సవాళ్లు, ప్రధాన విజ్ఞప్తులు వివరించబడ్డాయి. ప్రధానంగా మహిళా భద్రతా, బాలికల రక్షణ కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి సమర్థవంతమైన అమలు కోసం మార్గదర్శక సూచనలు, చర్యల ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మిషన్ శక్తి పథక కార్యక్రమాలు సమాజానికి గట్టి ప్రభావాన్ని చూపే విధంగా, సమగ్ర రూపంలో నడిపించాలని కమిటీ సభ్యులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే మూడు నెలల కాలంలో ప్రత్యేకించి చేపట్టవలసిన ప్రాజెక్టులు, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన చర్యలు మరియు సమీక్షా విధానాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోబడినవి. జిల్లా కలెక్టర్, మహిళా, బాలికల సంక్షేమానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో కృషి చేయవలసిన ముఖ్యమైన అవసరాన్ని ఎత్తిపడగలిగారు. ఈ సమావేశం అనంతరం, మిషన్ శక్తి స్కీం విజయవంతంగా అమలుకు కావలసిన అన్ని చర్యలు తక్షణం చేపట్టాలని కమిటీ సభ్యులకు హితవచనమిచ్చారు. తిరుపతి జిల్లాలో మహిళా శక్తి, బాలికల రక్షణకై పర్యవేక్షణ, సమీక్షలతో ముందడుగు వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పిజిఆర్ఎస్ వినతులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -చిత్తూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.యస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 343 అర్జీలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాల పరిమితులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించినప్పుడే అధికారులపైవిశ్వాసం కలుగుతుందన్నారు సమస్యల పై వినుతులను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ, డిప్యూటీ కలెక్టర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలపై ప్రత్యేక ఏర్పాట్లు

ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ :తిరుమలలో ఉన్న అన్ని ఔటర్ సైడ్ క్యూ లైన్ లను, ఆక్టోపస్ సర్కిల్ నుండి ఈ ఎస్ 1గేట్ వరకు క్యూ లైన్స్ పరిశీలించారు. క్యూలైన్‌కు సంబంధించి ఎక్స్‌టెన్షన్ విధానాన్ని పరిశీలించారు. గరుడ సేవకు సంబంధించి గతంలో ఉన్న క్యూ లైన్స్ కంటే ఇప్పుడుక్యూ లైన్స్ ఎక్స్‌టెన్షన్ చేయడం ద్వారా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు పలు సూచనలు చేశారు.అధికారులకు ప్రధానంగా భక్తులను ఔటర్ రింగ్ రోడ్డు నుంచి క్యూలైన్స్ లోకి తీసుకునే విధానం పైన అధికారు లతో చర్చించారు. గరుడ వాహనం ఎన్ని గంటలకు ప్రారంభం అవుతుంది.భక్తుల్ని ప్రధానంగా ఏ ఏ గేట్ల ద్వారా అధికంగా వస్తారు. అనేదాని పై పరిశీలించారు. ఇదిలా ఉంటే తూర్పు వైపు గేటు నుండి దక్షిణమాడ వీధిలోకి భక్తులు తీసుకునే విధానంతోపాటు దక్షిణమాడ వీధిలో ఉన్నటువంటి భక్తుల్ని పడమటి మాడా వీధి లోని కి ఏ గేట్లు ద్వారా తీసుకోవాలని విధివిధానాల గురించి చర్చించారు.పడమటి మాడ వీధిలో నుంచి ఉత్తర మాడ వీధిలోకి భక్తులు ఏ ఏ గేట్లు ద్వారా ఏఏ క్యూ లైన్స్ లో కి తీసుకునే దాని గురించి ప్రధానంగా అధికారులకు పలు సూచనలు చేశారు.బందోబస్తును గ్యాలరీస్ వద్ద ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఏదైనా సమస్య వచ్చినప్పుడు వీలైనంత తొందరగా బందోబస్తుసిబ్బందిని మొబిలైజేషన్ చేసుకొని దీనితో పాటు బాట గంగమ్మ దేవాలయం నుండి ఎన్ 1 గేటు వరకు అక్కడ కృష్ణ తేజ సర్కిల్ నుండి ఏ టి జి హెచ్ సర్కిల్ నుండి తిరుమలు నంబి సర్కిల్ వరకు తిరుమలలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

దొంగ ఓట్లు తొలగింపుపై ప్రత్యేకదృష్టి పెట్టండి

టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి

దొంగ ఓట్లు లేని ఓటర్ల జాబితాతో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుదాం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు లేని ఓటర్ల జాబితా తయారీకి, దొంగ ఓటు తొలిగించడానికి క్షేత్రస్థాయిలో నాయకులు గుర్తించి తొలగించాలని టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి కోరారు.సోమవారం రఘునాథ రిసార్ట్స్ లోని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో తిరుపతి రూరల్ మండల క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల సంగ్రామానికి బోగస్, డబుల్ ఎంట్రీ, మై గ్రేటెడ్, మృతి, పెళ్లి వెళ్ళిన వారి పేర్లను ఓట్ల జాబితాలో గుర్తించి తొలగించాలని ఆమె సూచించారు. దొంగ ఓట్ల తొలగింపు పై పెద్ద యుద్ధమే చేస్తున్నప్పటికీ ఇంకా తిరుపతి రూరల్ మండలంలో 20వేల దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు.మండల పార్టీ అధ్యక్షుడు ఏ. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి మాసాలలో స్థానిక ఎన్నికలు జరుగు తాయని, స్థానిక ఎన్నికలలో టిడిపి మద్దతుదారులు విజయకేతనం ఎగురవేసేలా నాయకులు కష్టపడి పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పాలన సాగుతున్నదని అన్నారు.గ్రామాలలో అందరూ కలిసికట్టుగా ఉంటూ స్థానిక ఎన్నికల సంగ్రామాన్ని దీటుగా ఎదుర్కోవాలన్నారు. గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అలిమినేని మధు నాయుడు, వైకుంఠం శ్రీధర్ నాయుడు, బిరుదుల భాస్కర్ రెడ్డి, అవిలాల సుధాకర్, యూ. మునిశేఖర్, భాను రెడ్డి, పేరూరు శ్రీనివాసులు, మధు శేఖర్, కత్తి సుధాకర్, చెరుకుల పరంధాం యాదవ్, శ్యాం బాబు, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఎంఈవో రవీంద్రనాథ్‌కు అభినందనలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: వృత్తిలో ఉత్తమ సేవలందించి నందుకు సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థుల కేంద్రం నందు సోమవారం ఎస్.టి.యు మండల శాఖ నాయకత్వం మొదటి మండల విద్యాశాఖ అధికారి కె.రవీంద్రనాథ్ ను అభినందనలతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసినందుకు, ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులు తీర్చిదిద్దడంలో తనవంత కృషి చేశారని కొనియాడారు. కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం అందుకోవడం హర్షదాయక మన్నారు. శాలువా పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో రెండోవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రమణ్యం, ఎస్టీయూ నాయకులు రామచంద్రయ్య, సురేష్, సమ్మిటి వెంకటేష్, కులశేఖర్, బాలసుబ్రమణ్యం తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌర్ణమి సందర్భంగా అన్నదానాలు

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: పౌర్ణమి సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలో పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. చంద్ర గ్రహణం సందర్భంగా అన్ని ఆలయాలు మూతపడ్డాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం మాత్రం భక్తులతో రద్దీగా కనిపించింది. దూర ప్రాంత భక్తులు పలువురు ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు సంస్థలు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం దుకాణాల సముదాయం వద్ద శివ ఆడియోస్ అధినేత భూపతి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు 500 మంది అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓంకార స్వామి మఠం నిర్వాహకుడు రామస్వామి కూడా అన్నదానం ఏర్పాటు చేశారు. సన్నిధి వీధిలోని రామ మందిరం వద్ద భక్తులకు అన్నదానం జరిగింది.

బాధిత నిరుపేదలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి "సహాయ నిధి"

బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో శంకర్ రెడ్డి

విశాలాంధ్ర-సత్యవేడు: ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న నిరుపేదలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు సత్యవేడు నియోజకవర్గ టిడిపి కార్యక్రమాల సమన్వయకర్త శంకర్ రెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు రెండు లక్షల రూపాయలకు సంబంధించిన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమం కోసం పెద్ద పేట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న నిరుపేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సీఎం సహాయనిధి ద్వారా కొంతమేర ఆర్థిక సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తారు. తద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత సంబంధిత ఖర్చులను తగిన బిల్లలను సమర్పించి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు వీలు పడుతుందన్నారు. సీఎం సహాయ నిధిని నిరుపేద కుటుంబాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తదనంతరం ముగ్గురు బాధిత వర్గాలకు 2,00,670 రూపాయలు సంబంధించి సీఎం సహాయనిధి సొమ్ముకు సంబంధించి చెక్కులను శంకర్ రెడ్డి అందించారు. ఇందులో మండలంలోని అలిమేలు మంగాపురం గ్రామానికి చెందిన బాధితురాలు ఆర్. వరలక్ష్మి అనారోగ్యానికి గురై చికిత్స తీసుకున్నందుకు 93,390 రూపాయ లు, పట్టణంలో దలవాయి అగ్రహారం చెందిన చెంగ్రాయన్ ప్రమాదంలో గాయపడి చికిత్స చేసుకున్నందుకు 42,276 రూపా యలు, సిరణంబుదురు గ్రామంలో ప్రమాదంలో మృతి చెందిన యువరాజ్ బాధితులకు 65,104 రూపాయలకు సంబంధించిన చెక్కులను శంకర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందస్వామి, మురళి (చికెన్‌చిన్న), సర్పంచులు రవి రెడ్డి, రూబెన్, గోవిందస్వామి,జడేరిబాబు, సురేంద్ర రెడ్డి, చిట్టి రెడ్డి, అమాస్ రెడ్డి, ధనశేఖర్, షణ్ముగం,జనసేననాయకుడుబాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మనిషి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం

- ఈ.ఎస్.ఐ.ఆసుపత్రిలో ఫిజియోథెరపీ దినోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక ఆర్.సి.రోడ్ లోని ఈ.ఎస్.ఐ. ఆసుపత్రిలో సోమవారం ప్రపంచ ఫిజియో థెరపి దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాం బాబు మాట్లాడుతూ వయస్సు మళ్ళిన వారు, వయో వృద్ధులు ఫిజియో థెరపీ చేసుకోవడం ద్వారా మానసికంగా దృఢంగా, ఉత్సాహంగా ఉంటారని పేర్కొన్నారు. ఆసుపత్రి ఫిజియో థెరపి డాక్టర్ బి. ఎస్. ఎన్. వినోద్ కుమార్ మాట్లాడుతూ ఫిజియో థెరపి ద్వారా ఎముకలు, కీళ్ళు, నరాలు వంటి నొప్పులతో బాధపడే వారికి ఎంతో ఉపశమనం కలుగుతుందని, వృద్ధులు సైతం యుక్త వయసు వారిగా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర లోని ఈ.ఎస్.ఐ. ఆసుపత్రుల్లో ఫిజియో థెరపిలో బి.ఎస్.ఎన్. వినోద్ కుమార్ కు అందిస్తున్న సేవలు అభినందనీయమని మెడికల్ సూపరింటెండెంట్ సురేష్ డాక్టర్. ఎం.శ్యాంబాబు, ఇతర డాక్టర్లు కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులు ప్రతి రోజూ చేయాల్సిన వ్యాయామ పద్ధతులను రోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియో థెరపి డాక్టర్ వినోద్ కుమార్, ఆసుపత్రి ఆర్. ఎం.ఓ. డాక్టర్. ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ సి. అమ్ములు, లే సెక్రటరీ అధికారిణి ఓ.రాధమ్మ, డాక్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత తోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని చంద్రగిరి మండలం నందు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నోడల్ అధికారి ప్రసాద్ అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. ప్రసాద్ మాట్లాడుతూ, సంపూర్ణ అక్షరాస్యత తోనే రాష్ట్ర అభివృద్ధిని సాధించవచ్చు అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరిస్తూ, నిరక్షరాస్యత నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం కీలక పాత్ర వహిస్తున్నదని తెలియజేశారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 88,678 మందిని నిరక్షరాసులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమం ప్రారంభమైందని ప్రసాద్ తెలిపారు. ఏపిఎం చిన్న గంగయ్య మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు పొదుపు సంఘాల అభివృద్ధికి ఎంతగానో సహాయ పడతాయని, సమర్థంగా అమలులో ఉండటం ద్వారా గ్రామాభివృద్ధికి దోహదపడతాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు థామస్ అబ్రహం, సుజాత తదితర గ్రామ మహిళలు పాల్గొని, అక్షరాస్యత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు.

టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రతిపాదనలు

విశాలాంధ్ర-పూతలపట్టు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బి.రాజగోపాల్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ కాణిపాకం దేవస్థానం ఈ.ఓ పెంచల కిషోర్, కాణిపాకంలో టీటీడీ కళ్యాణమండపం, విశ్రాంతి భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి చైర్మన్ కు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే, ఈఓ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి..కాణిపాకం క్షేత్రాభివృద్ధికి టీటీడీ తరపున సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి హుండి లెక్కింపు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయమునందు సోమవారం పరకామణి ఉండి లెక్కింపు చేయగా ఒక లక్ష 6,6 22 రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారి రమేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఆలతూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వరద వెంకటేశ్వర స్వామి ఆలయమునందు ఉండి లెక్కింపు చేయగా 2240 వచ్చినట్టు తెలియజేశారు.

ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 30 వినతులు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కు 30 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 21 మంది నేరుగా వచ్చి సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించగా, తొమ్మిది మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ తమ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, చెన్నారెడ్డి కాలనీ స్మశానంలోని మరమ్మత్తులు చేయించాలని, నీటి సౌకర్యం కల్పించా లని కార్పొరేటర్ పునీత కోరారు. కాగా నారాయణపురం, రేణిగుంట రోడ్డులో గుంతలను పూడ్చాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, డి.ఆర్.మహల్ వద్ద షాపుల వారు రోడ్డు ఆక్రమిస్తున్నారు నివారించాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయించాలని కార్పొరేటర్ ఎస్.కె.బాబు ఫోన్ ద్వారా కోరారు.

యూరియా కొరతపై భగ్గుమన్న సిపిఐ

- రైతులకు యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం
- రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి: వ్యవసాయకార్మిక సంఘం
- రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.ప్రభాకర్

విశాలాంధ్ర-చిల్లకూరు: రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగానికి ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు సరిపడా చాలినంత యూరియాను సరఫరా చేయడంలోనూ అందించడంలోనూ చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చీపినేటి ప్రభాకర్ సోమవారం యంపిడివో కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో రైతులు, కార్యకర్తలు, మహిళలు, సానుభూతి పరులతో కలసి నిర్వహించిన ధర్నాలో నిశితంగా విమర్శించారు. రైతు సంక్షేమ ప్రభుత్వం అని చెపుతున్న కూటమి నేతలు, రైతుల పట్ల సానుకూల వైఖరి తీసుకోవాలని, యూరియా బ్లాక్ మార్కెట్ ఆపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చెసారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి ఎరువులు అందించకపోవడం శోచనీయమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కారించడంలో గిట్టుబాటు ధరలు కల్పించడంలో మీనమేషాలు లెక్కించడం సిగ్గు చేటు అని అన్నారు. అధికారంలోకి రాకముందు రైతే రాజు , రైతులు దేశానికే వెన్నుముక అని భారతదేశం వ్యవసాయిక దేశం అని ఎన్నికల సభలలో ఘనంగా మాట్లాడి తీరా ప్రభుత్వం లోకి వచ్చిన అనంతరం రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం భాధాకరమని ప్రకటించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో, రైతులు ప్రతి యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖామాత్యులు అచ్చంనాయుడు యూరియా కొరత రాష్ట్రంలో ఎక్కడాలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. యూరియా కొరత తీవ్రంగాఉందని, తూర్పుగోదావరి జిల్లాలో రైతులు పోరుబాట పట్టి ఆందోళనలు చేస్తున్న విషయం వ్యవసాయ శాఖ మంత్రి గమనించాలన్నారు. ఇతర రాష్ట్రాలనుండి వస్తున్న యూరియా నల్ల బజారు లోకి పోతున్నదని, దీనిపై కఠిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క రైతుకు ప్రత్యామ్నాయ పంటలకు నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందించాలని భవిష్యత్తులో తిరుపతి జిల్లాలో రైతాంగానికి యూరియాను తగినంత గోదాములలో నిల్వ చేసి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం బహుళార్ధసాధక ప్రాజెక్టు తో పాటు నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు. ఎన్నికల వాగ్దానం గా కూటమి ప్రభుత్వం ప్రకటించిన 20 వేల రూపాయల సాగు సాయం ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో విడుదల చేసి జమ చేయాలన్నారు. రైతు ఋణవిమోచన చట్టం చేసి, రైతుల ఋణాలను ఒకేసారిమాఫీచేయాలన్నారు. పాడి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. కౌలు రైతుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్టం లో రైతు వ్యతిరేక అంశాలను రద్దు చేయాలన్నారు. భీమా రుసుం ప్రభుత్వాలే భరించి, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు 10 వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు రైతులకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రైతులతో కలసి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని కఠినంగా హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం యంపిడివో కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఐ కార్యదర్శి శశికుమార్, మండల సిపిఐ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు సునీల్, నాయకులు గోపాల్, వెంకటేశ్వర్లు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాయల్ పీపుల్స్ ఫ్రంట్ అధ్యక్షుడిగా విజయకుమార్

విశాలాంధ్ర-పుంగనూరు: రాయల్ పీపుల్స్ ఫ్రంట్ పుంగనూరు పట్టణ అధ్యక్షుడిగా సిరివేలు విజయకుమార్ను సమస్త వ్యవస్థాపకులు రెడ్డి శేఖర్ రాయల్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాయల్ సోమవారం నియమించడం జరిగింది. అధ్యక్షుడుగా నియమింపబడటంతో అనేకమంది బలిజ సంఘం సేవ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సిరువేలు విజయ్ కుమార్ మాట్లాడుతూ రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సంస్థను అన్ని విధాలుగా గ్రామస్థాయి నుండి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరికి ఇబ్బంది కలిగిన అండగా ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. నన్ను నమ్మి ఈ పదవి ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. బలిజ సంఘం బలోపేతమే లక్ష్యంగా బలిజ సోదరులందరినీ ఒకే తాటిపైకి తెచ్చి బలిజ సోదరుల సంక్షేమం కోసం రాయల్ పీపుల్స్ ఫ్రంట్ ద్వారా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాన్ బాలమని నాన్ బాల కుమార్ రాఘవ రాయల్ మనోహర్ పగడాల కిషోర్ మంజునాథ్ గంగాధర్ కుమార్ ఆనంద్ సిరువేలు రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి పలువురు నివాళి

విశాలాంధ్ర-దొరవారిసత్రం: దొరవారి సత్రం మండలంలోని అక్కరపాక గ్రామ మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి సుధాకర్ రెడ్డి (78) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి పరస వెంకటరత్నం, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మండలంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి సుధాకర్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. అనంతరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అక్షరాస్యతను పెంచాలి

విశాలాంధ్ర-చిల్లకూరు: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం, పారిచెర్లవారిపాళెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరినీ అక్షరం ఆకారంలో ఉంచి, సామూహికంగా విద్య మరియు చదువు కోవడం యొక్క ఆవశ్యకతను వినూత్నమైన శైలిలో తెలియ జేసారు. ప్రధానోపాధ్యాయురాలు పి.అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారతీయ శిక్షణ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రజేంద్ర రెడ్డి మాట్లాడుతూ యునెస్కో సంస్థ వారు సెప్టెంబర్ 8వ తేదీని, ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం గా ప్రకటించారని ప్రపంచంలో సభ్య దేశాల ప్రజల అభివృద్ధి కి చదువే అతి ప్రధానమైన కారణంగా గుర్తించారన్నారు. నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. వయోజనులకు వయోజన విద్య మరియు సార్వత్రిక విద్య పై సరైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రంధం మాధవయ్య, బి.కామేశ్వరి, శ్రీనివాసులు, రవీంద్ర, డివి రమణయ్య, లీల, నాగభూషణమ్మ, లావణ్య, సంధ్యారాణి, సుగుణ, బత్తల శేషారెడ్డి, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ఇంటి ముందర పెరటి పెంపకం ద్వారా ఆరోగ్యం వస్తుందని వెలుగు సమైక్య అధికారి మునెయ్య తెలిపారు. మండలం వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో పెరటి తోటలో కూరగాయలు సాగు సోమవారం వెలుగు సమైక్య సిబ్బంది పరిశీలించారు. మహిళా సంఘాలు సభ్యులు ఇంటి దగ్గర స్థలంలో పెరటి తోటలు పెంచుకోవడం అలాగే కంపోస్ట్ ఫిట్ ఏర్పాటు చేసి తద్వారా సేంద్రీయ పద్ధతిలో కుటుంబానికి కావలసిన కూరగాయలు ఇంటి వద్ద పండించడం ద్వారా ప్రతి కుటుంబంలో పౌష్టిక ఆహారంతో పాటు ఆరోగ్యం లభిస్తుందిని ఏపీఎం మహిళలకు వివరించారు ముందస్తు ప్రణాళికలతో మండల మహిళా సమాఖ్య, గ్రామ సమాఖ్య, సంఘం సమావేశాలులో అవగాహన కల్పించడం జరిగింది. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్రతి గ్రామంలో కిచెన్ గార్డెన్స్ కంపోస్ట్ ఫిట్ ఏర్పాటు పై ఏపియం మునెయ్య, సీసీ లు పయని, వెంకటరత్నం, వీరజిన్న, జీవ గ్రామాలలో వెళ్ళి తనిఖీ చేయడం జరిగింది, ఇప్పటికే కొందరు ఈ కార్యక్రమాలు బాగా చేస్తున్నారు, ఇంటి దగ్గర స్థలం, నీటి వసతి వున్న ప్రతి ఒక్కరూ పెరటి తోటలు పెంచుకోవడం ద్వారా ఎలాంటి పురుగు మందులు వాడకుండా సేంద్రియ పద్ధతులు ఇంటి దగ్గరే కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవడం ద్వారా పౌష్టిక ఆహారం లభిస్తుందని సమైక్య అధికారులు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారందరూ కూడా గృహాల వద్ద పెరటి తోట పెంపకాలతో ఆరోగ్యాన్ని పెంపొందించకోవడానికి దోహదపడుతుందన్నారు.

కాలువలో పూడిక, చెట్లను తొలగించాలి

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండలం లోని ఈదులగుంట ఎల్.ఐ.సి. కాలనీ గుండా వెళ్తున్న ఈదుల గుంట కాలువలోని పూడిక చెట్లను తీసి కాలువను శుభ్రపరచాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ షేక్ కరీముల్లా తొట్టంబేడు తహసిల్దార్ భారతికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలములో ఈదులగుంట చెరువు నిండి కాలువ నుంచి ఎల్ఐసి కాలనీ పైగా నీరు ప్రవహిస్తాయని తహసిల్దార్ కి వివరించారు. కాబట్టి రెవెన్యూ వారు వర్షాలు మొదలవ్వకముందే కాలువను శుభ్రపరిచి చెత్తాచెదారాలను తొలగించి కాలువ నీటితో ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ చిరంజీవి మాట్లాడుతూ కాలువ కొన్నిచోట్ల ఆక్రమణకు గురైందని అటువంటి ఆక్రమణలను తొలగించాలని అదేవిధం గా కాలువలో చెట్లు చెత్తాచెదారాలు ఉండడం వలన క్రిమి కీటకాలు అధికంగా చేరే అవకాశం ఉందని దోమలుకూడ అధిక సంఖ్యలో ఉత్పత్తి అయ్యే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజాముద్దీన్, ఈదులగుంట పఠాన్ కరీముల్లా, పాలూరి వెంకట ముని, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 12 గంటలైనా పత్తాలేరు

గూడూరు సిపిఐ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర-చిల్లకూరు: మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులు రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని, సమస్యలపై వస్తే మధ్యాహ్నం 12 గంటలైనా వ్యవసాయ శాఖ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదని గూడూరు సిపిఐ కార్యదర్శి శశికుమార్ ఆవేదన వ్యక్తం చేసారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సిహెచ్.ప్రభాకర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని పోవడం జరుగుతుంది అని తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి, ఏఐటియూసీ నాయకులు నారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు సునీల్ తదితరులు వ్యవసాయ శాఖ కార్యాలయం, మూసిన తలుపులు ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేసి, సంబంధించిన ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

క్వారీ పనులు ఆపాలని కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర-చిత్తూరు: వెదురుకుప్పం మండలం కోమరగుంట పంచాయతీ బంధాల పల్లెలో క్వారీ పనులను వెంటనే ఆపాలని ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ క్వారీ వల్ల పంట పొలాలు నాశనం కావడంతో పాటు, తాగునీరు సైతం కలుషితం అవుతుందని పలుమార్లు అధికారులకు విన్నవించిన ప్రయోజనం లేదని వాపోయారు. ఈ పనులను ఆదివారం గ్రామస్తులు అడ్డుకోవడంతో క్వారీకి సంబంధించిన వ్యక్తులు తమపైనే దాడి చేసి గాయపరిచారని చెప్పారు. ఈ సందర్భంగా స్పందన కార్యాలయం ఎదుట వెంటనే ఈ క్వారీ పనులను నిలిపివేలని, కలెక్టర్ బయటకు వచ్చి తమ సమస్యను వినాలని, తమపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని నిరసన చేపట్టిన వారిలోకొందరిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

మైక్రోబయాలజీలో వాసవికి డాక్టరేట్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాల యం మైక్రోబయాలజీ విభాగం పరిశోధక విద్యార్థి కాపులూరు వాసవికి డాక్టరేట్ ను ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి.రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె జంతుశాస్త్రం విభాగానికి చెందిన ఆచార్యులు ప్రొఫెసర్ మారం రాజశేఖర్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ బయోజెనిక్ సిల్వర్ నానోపార్టికల్స్ అగైనెస్ట్ మల్టీడ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియల్ స్ట్రెయిన్స్ ఐసోలేటెడ్ ఫ్రమ్ హాస్పిటల్ ఎన్విరాన్మెంట్ అండ్ దేర్ జెనెటిక్ బార్కోడింగ్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు. వాసవికి డాక్టరేట్ లభించడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

పేద విద్యార్థులకు చేయూత

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాలకు పంచాయతీరాజ్ రిటైర్డ్ ఇఇ గిరినాథ్ దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శిశు మందిరంలో చదివే పేద విద్యార్థుల ఫీజుల నిమిత్తం 37.వేల రూపాయల నగదు చెక్కును అందజేసి, 160 మంది పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యతో పేదరికాన్ని దూరం చేయవచ్చునని, దాతలు అందిస్తున్న ఆర్థిక సహాయాలను దృష్టిలో ఉంచుకొని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. లైన్స్ క్లబ్ చేస్తున్న సేవలో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం ఆయనను క్లబ్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు ఎం.మురళీరెడ్డి, క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య, కార్యదర్శి రవిచంద్ర రెడ్డి, సీనియర్ లయన్ ఎస్.కె రియాజ్ అహ్మద్, మయూరి శ్యామ్ యాదవ్, రూపేష్ రెడ్డి, వీరేంద్రనాథ్, వి.రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని ఎంఆర్ పల్లి సర్కిల్ వద్ద నిరసన

విశాలాంధ్ర-తిరుపతి: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం తిరుపతి నగరంలో ఉన్నటువంటి ఎంఆర్ పల్లి సర్కిల్ నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలని రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభగల, పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమౌతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే... అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి 14 మెడికల్ కళాశాలలకు శంకుస్థాపన చేశారని అన్నారు. రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, విజయనగరం జిల్లాల్లో గత విద్యా సంవత్సరంలో కళాశాలలను ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వం 107, 108 ఉత్తర్వుల్ని తీసుకువచ్చి నూతన మెడికల్ కళాశాలల్లో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను బీ, సీ కేటగిరీలుగా విభజించి... బీ-కేటగిరీ రూ.12 లక్షలకు, సీ కేటగిరి రూ.25 లక్షలకు విక్రయించడం వల్ల అనేకమంది పేద ప్రతిభా విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్... నాడు తన సొంత నియోజకవర్గం మంగళగిరిలో జరిగిన యువగళం పాదయాత్రలో... తాము అధికారంలోకి వచ్చాక జీవో నంబర్ 107, 108 ను 100 రోజుల్లోనే రద్దు చేసి వైద్య కళాశాలలను నూరుశాతం ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చాక పీపీపీ విధానాన్ని తీసుకొచ్చి వైద్య కళాశాలలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. దీనివల్ల కేవలం నష్టపోయేది విద్యార్థులు మాత్రమే కాదు... అనేకమంది పేద వర్గాల ప్రజలు కూడా ఉచిత వైద్యానికి దూరమవుతారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీపీపీ విధానం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ వినయ్, ఓం రాజు, మోహన్ తిరుపతి నగర నాయకులు గ్రేస్, హరీష్, అఖిల్, బాలాజీ, హర్ష రమణ, సుమంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.బి.కె యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

విశాలాంధ్ర-సత్యవేడు: స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేలకు సంబంధించిన రికార్డు వివరాలను ఎంబికె-2.0 యాప్లో నమోదు చేయాలని తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ (వెలుగు) ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ కోరారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంబికె యాప్పై జరిగిన సంఘమిత్ర సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో త్రివిక్రమరావు,స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్య ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ మాట్లాడుతూ సంఘ సభ్యుల నిర్వహణకు సంబంధించిన పుస్తకాల వివరాలన్నీ ఎంబికే యాప్లో అప్డేట్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సీడ్ క్యాపిటల్లో భాగంగా చిరు వ్యాపారస్తులకు శ్రీనిధి ద్వారా 40 వేల రూపాయల రుణాన్ని మంజూరు చేస్తామన్నారు. సభ్యులు ఇది చెల్లిస్తే హయర్ ఆర్డర్ ఎంటర్ప్రెన్యూర్ ద్వారా 75 వేల రూపాయలు రుణం మంజూరు చేస్తామని ఆయన వివరించారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ రుణం మంజూరు సంబంధించి అర్హుల జాబితాను సమర్పించాలని ఆయన సంఘ మిత్రలను కోరారు. సక్రమంగా రుణం చెల్లించే వారికి ఎంతైనా రుణం ఇవ్వడానికి తమ బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. తదనంతరం స్వయం సహాయక మహిళలకు ఎంపీడీవో త్రివిక్రమరావుతో కలిసి వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ కూరగాయ విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సమావేశానికి వెలుగు కోఆర్డినేటర్లు శివకుమార్, మధుసూదన్, పురుషోత్తం, పుల్లయ్య, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన, పలువురు సంఘమిత్రలు పాల్గొన్నారు.

104 వైద్య సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో 104 సేవలు వెలకట్టలేనివని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి గాను రెండు మూడు గ్రామాలలో 104 వైద్య బృందం వెళ్లి వారికి సంబంధించినటువంటి అంతర బాహ్య శారీరక రుగ్మతలకు వైద్యం చేసి తరిస్తున్నారు. ఈ సేవలతో వారు సంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. బీపీ షుగర్ కాళ్లవాతం కంటి చూపు వంటి అనేక రుగ్మతలకు మందులను ఇచ్చి వారిని ఆదుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. ప్రతి నెల ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి తమ కష్టాలను దూరం చేస్తున్నారని ఇటువంటివైద్య సేవలు తమకెంతో సంతృప్తికరమిస్తున్నాయని వారు తెలియజేయడం జరిగినది. ఈ క్రమంలో పాతూర్ సత్రం గ్రామ పంచాయతీ కేంద్రంలో సోమవారం 104 సేవలను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్ హెచ్పి నిరుపమా, ఏఎన్ఎం అరబ్ జాన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ బి బేబీ ఆశా వర్కర్ జి.రెడ్డమ్మ పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కి వినతి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయాస్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్. నెం జి-3045) రాష్ట్ర నాయకులు గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్‌ని కలిసి, రాష్ట్రంలో పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్/ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వివరమైన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ నేతృత్వంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. గత నెలలో ముఖ్యమంత్రి తిరుపతి జిల్లాలో పర్యటించిన సందర్భంలో తాము స్వయంగా వినతి పత్రం అందజేసినట్లు, కానీ దురదృష్టవశాత్తూ, ఆ వినతి పత్రం పై పూర్తి వివరాలు పరిశీలించకుండా 'ఇది మా పరిధిలో లేదు' అనే కారణంతో ఒక లేఖ మాత్రమే మాకు అందిందని, ఇది మా సంఘం, రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల మద్దతుతో పనిచేస్తున్న వారి హక్కులకు, పరిరక్షణకు తీవ్ర ఆందోళన కలిగించే అంశమని భావిస్తున్నామని పత్రిక ముఖంగా తెలియజేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి చేయడం జరిగింది. ఈ వినతిపత్రం ముఖ్యమంత్రి ద్వారా విద్యుత్ శాఖ కార్యదర్శికి తగినవిధంగా పంపించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికుల నైతిక, ఆర్థిక భద్రతకు కలెక్టర్ ద్వారా చర్యలు తీసుకోవాలని. సుధాకర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రభుత్వ వేదికగా ముఖ్యమంత్రి కార్యాలయం ఉండాలని, సాధారణ పౌరుడైన మేము ముఖ్యమంత్రిని కలిసినప్పుడు సమస్యలు తీవ్రంగా పరిశీలించి సంబంధిత శాఖ కార్యదర్శికి సమర్పణ జరగడం ప్రజాస్వామ్యంలోని న్యాయ ప్రావణ్యత అని మేము నమ్ముతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొని విద్యుత్ రంగంలో పని చేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయపరంగా ప్రభుత్వం స్పందించాలని ఆకాంక్షించారు.

వైయస్సార్ పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేద్దాం

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని స్థానిక మంజునాథ కళ్యాణ మండపం నందు మండల వైసిపి అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు సోమవారం రోజున సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అనూష రెడ్డి పెద్దిరెడ్డి మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి జెడ్పిటిసి చంద్రారెడ్డి యాదవ్ జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు

విశాలాంధ్ర–బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో సోమవారం యూరియాను రైతులకు పంపిణీ చేయడం జరిగినది. దీనిలో భాగంగా సరిగ్గా యూరియా పంపిణీ జరగడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైరెడ్డిపల్లి పరిసర గ్రామాలకు చెందినటువంటి వారికి రైతు సేవ కేంద్రాల నందు యూరియాను పంపిణీ చేయడం జరిగినది. రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని దీనివల్ల పంటలను పండించడానికి ఆసక్తి సన్నగిల్లుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు ఎకరాల భూమి ఉన్న రైతుకు ఒక బస్తా యూరియా ఇస్తే అర ఎకరానికి కూడా చాలదని ఆ ఒక బస్తా కూడా సరైన సమయంలో ఇవ్వట్లేదని నాట్లు వేసే సీజన్ దాటిపోయి పది రోజులు అవుతున్న ఇప్పటికీ యూరియాని సప్లై చేయకపోవడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సీజన్లోనూ రైతులకు ఈ మధ్యకాలంలో ఇటువంటి అవాంతరాలే ఎదురవుతున్నా యని, వేరుశనగ పంట కూడా అనుకున్న విధంగా వేయలేక పోయామని, ఇప్పుడు వరి సంబంధిత పంటలను పండించలేక పోతున్నామని, ఇదే విధంగా రైతులు నిరుత్సాహపడినట్లయితే వారు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి బ్రతకాల్సి వస్తుందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుబ్రమణ్య స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర–రామకుప్పం: మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ వళ్ళీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం పెద్ద సంఖ్యలో భక్తాదులు పోటెత్తారు సోమవారం తెల్లవారుజామున చంద్రగ్రహణంతో ఆలయాన్ని శుద్ధి చేసి వేద పండితులు మంత్రోచ్ఛారణతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. భాద్రపద మాసంలో ప్రతి ఏటా ఐదు సోమవారాలు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడంతో ఆలయం దినదినాభివృద్ధి చెంది భక్తుల కోర్కెలను నెరవేరుస్తూ ప్రసిద్ధిగాంచిందని భక్తుల నమ్మకం కాగా సరిహద్దు రాష్ట్రాలైన ఇటు కర్నాటక రాష్ట్రం నుండి అటు తమిళనాడు రాష్ట్రం నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి

విశాలాంధ్ర–సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో వెలసిన శ్రీ గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానమును సూళ్లూరుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కుమారి, పి.సంయుక్త స్వామి వారి ధరించు కొన్నారు. వారిని ఆలయ చైర్మన్ తాటిపర్తి. ఆదినారాయణ రెడ్డి స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవకు పట్టాభిషేకం

విశాలాంధ్ర–సూళ్లూరుపేట: 40వ జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా, సోమవారం నెల్లూరులో జరిగిన ముగింపు కార్యక్రమంలో భాగంగా, నేత్రదాన మహోద్యమంలో సూళ్ళూరుపేట పరిసర ప్రాంతాలలో 952 కార్నియాలు సేకరించినందుకు గాను సూళ్ళూరుపేట, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధి మన్నెమాల శ్రీనివాసులుకి మెమెంటో, ప్రశంసా పత్రములను జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రామ్ మేనేజర్ డా. శర్వాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. సుజాత అందజేయడం జరిగింది.

గురువులను గౌరవించడం మన సంప్రదాయంలో భాగం

పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

విశాలాంధ్ర–పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ గురుపూజోత్సవానికి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బంగారుపాలెం మండలం పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ... గురువులను గౌరవించడం అనేది మన సంస్కృతిలో ఎంతో గొప్ప సంప్రదాయం అని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువులు మనకు జ్ఞానాన్ని అందించి, జీవితం సార్థకమయ్యేలా మార్గం చూపుతారని చెప్పారు. అందుకే మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అని మన గ్రంథాలు చెబుతున్నాయన్నారు. ఈ రోజుల్లో విద్యార్థులు విజ్ఞానంతో పాటు విలువలతో ముందుకు సాగాలని, ఆ విలువలను అందించే బాధ్యత గురువులదే. ఒక గురువు తన శిష్యుని జీవితాన్ని మార్చగలడు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దగలడని తెలియజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో విజయం సాధించడానికి వెనకాల ఒక గురువు శ్రమ, త్యాగం, ప్రేరణ ఉంటాయని, మనందరం ఆ త్యాగాన్ని గుర్తుంచుకోవాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంగారుపాలెం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణీ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ మరియు మండల నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న దాత పోరు విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర–బుచ్చినాయుడు కండ్రిగ: రాష్ట్రంలోని రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్య పరిష్కరించుకొనుటకు అన్న దాత పోరు కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా రైతులు విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వేలూరు రాకేష్ సోమవారం పార్టీ శ్రేణులకు రైతులకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వేలూరు రాకేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిరంకుశ పాలన కొనసాగి స్తున్నదని విమర్శించారు. వ్యవసాయంలో రబీ సీజన్ మొదలుకానున్న సమయంలో యూరియా కొరత ఏర్పడడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. ఇది వ్యవసాయ విధానాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరి చూపుతున్నది.ముందస్తు ప్రణాళికల లేకపోవడవలనే, నిర్లక్ష్యం కనబడుతున్నది. అధికార వ్యవస్థలో సమన్వయంలేమి బట్టబయలు కనబడుతున్నది.ప్రతి సంవత్సరం వ్యవసాయంలో అదునుకి విత్తనాలు, ఎరువులు అవసరం ఉందని తెలిసి కూడా, ఈ ఏడాది రైతులకు అవసరమైన యూరియా సరఫరాను ముందస్తుగా నిల్వ చేయకపోవడ ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా కచ్చితమైన చర్యలు తీసుకోవాలని వైఎస్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నామన్నారు. యూరియా, డి.ఎ.పీ, పొటాష్, వంటి అవసరమైన ఎరువుల కోసం ముందస్తు అంచనాలు వేసి నిల్వలు చేపట్టే విధానాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులకు సరఫరా వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా టోకెన్ సిస్టమ్, డిజిటల్ ట్రాకింగ్ పద్ధతులు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 9వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద శాంతియుతంగా నిరసన తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

విశాలాంధ్ర–ఎస్ఆర్ పురం: మండలంలోని మంగుంట గ్రామం వద్ద చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దతయ్యూరు గ్రామానికి చెందిన ఖాదర్ బాషా చిన్న కుమారుడు వశ్రీం (4), కొత్తపల్లిమిట్ట నుంచి తన తండ్రితో కలిసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా, అదుపు తప్పి రోడ్డు మీద పడిపోయాడు. ఈ ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీస్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వశ్రీం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు.

ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే కఠిన చర్యలు

విశాలాంధ్ర–రామచంద్రాపురం: మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ మధుసూదన్ రావు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమ వారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ భూములు కబ్జా కు గురైతే సంబంధిత వీఆర్వోల పై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని గుర్తు చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ భూములను గుర్తించా లన్నారు. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించి యంత్రాలతో చదును చేస్తే ల్యాండ్ గార్బింగ్ యాక్ట్ మేరకు క్రిమినల్ కేసులో నమోదు చేస్తామని తెలిపారు. ప్రజల నుండి పలు సమస్యలపై పీజీఆర్ఎస్ లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే అధికారులు విధులకు సకాలంలో హాజరు కావాలని, కుంటి సాకులు చెప్పి సెలవులు పెడితే వారిపై కలెక్టర్కు నివేదిక పంపుతానన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు గుణ భూషణ్ నాయుడు, శ్రీనివాసులు, ఝాన్సీ రాణి, వెంకటరమణ, నరసింహులు, రాజశేఖర్, మల్లికార్జున్ రెడ్డి, సిబ్బంది వంశీకృష్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులుకు సకాలంలో ఎరువులు అందించాలి

- పంటలకు నష్ట పరిహారం కల్పించాలి

- సిపిఐ చంద్రగిరి మండల కార్యదర్శి శ్రీ రాములు డిమాండ్

విశాలాంధ్ర–చంద్రగిరి: చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ, ఈ మండలంలో భీమవరం, కొంగర వారి పల్లి, గంగిరెడ్డిపల్లి, బొప్పరాజు పల్లి, శానంభట్ల, కొటాల, అయితే పల్లి, తదితర గ్రామాలలో ఎరువులు సకాలంలో అందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులకు గురవుతున్నారు. పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని, రైతులకు పంట పండించటానికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించాలని, యూరియా, గ్రోమోర్, పంటలకు పురుగు పట్టకుండా మందులు అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్ వారు సకాలంలో అందించాలని, లేనియెడల ఈ మండలంలో ఉన్న రైతాంగాన్ని సమీకరించి రైతుల ఇబ్బందుల పైన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు పంట పండిస్తే తప్ప జీవనోపాధి కల్పించడం సాధ్యం కాదని ప్రభుత్వాధికారులు గుర్తించుకోవాలని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమతి పిలుపులో భాగంగా ఇప్పటికే అరకొర బతుకులతో బతుకీడుస్తున్న రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం యూరియాను అందించడంలో విఫలమైంది. ఈ 15 రోజులు దాటితే రైతన్నలకు యూరియా ఏ విధంగా ఉపయోగపడదు ఇవాళ ఎన్నోసార్లు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ కు సమాచారం అందించిన కొంతమంది రైతులకు మాత్రమే యూరియా బస్తాలు ముందే ఇచ్చి మిగిలిన రైతులకు యురియా లేకుండా చేస్తున్నారు. ఈరోజు రైతన్న ఫర్టిలైజర్ షాపుల్లోకి వెళ్లి రైతులు ఒక బస్తా కొనాలంటే 300 ఉన్న ఒక బస్తా యూరియా 450 రూపాయలకు అమ్ముతున్నారు. రైతన్న కొనేదెట్లా పంట పండించేది ఎట్లా ఒక బస్తా యూరియా కొనాలంటే వరి పంట కు మందులు వేయాలంటే టాబ్లెట్స్ వేస్తారు అవి తీసుకుంటేనే ఒక యూరియా బస్తా ఇస్తామంటున్నారు. కావున ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే రైతన్నలకు యూరియా అందించాలి అని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చంద్రగిరి మండలం సమితి గా కోరుతున్నాం ప్రజాసంఘాల నాయకులు కార్మిక సంఘాల నాయకులు రైతులు పాల్గొనగా ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి కేవై రాజా పార్వతి,గీత, కళావతి, బాలకృష్ణ, ఫయాజ్, నారాయణ బాబు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుం జయస్వామికి సోమ వారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ళ, పసుపు, కుంకుమ, విభూతి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్య లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యబీమాను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని స్థానిక బిజెపి కార్యాలయం నందు రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ నాయకులు అయుబుఖాన్ మీడియాతో మాట్లాడటం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఉచిత ఆరోగ్యబీమా అందుబాటులోకి వస్తోందని సుమారు 1.63 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ2.5 లక్షల వరకు నగదు రహిత వైద్యసేవలు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ ఆరోగ్య భీమా వలన 1.43 కోట్ల పేద కుటుంబాల (బీపీఎల్)కు ఏడాదికి రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందుతుందన్నారు ఈ ఆరోగ్య బీమా వర్కింగ్ జర్నలిస్టులకు ప్రయోజనాలు వర్తింప చేయాలని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్తింప చేయడం చాలా సంతోషకరమన్నారు అనేకమంది వర్కింగ్ జర్నలిస్టులు ఈ బీమా సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు ఈ పథకం వల్ల రాష్ట్రం లో 5.02కోట్లు మందికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన,డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా వైద్య సేవలు అందిస్తుండగా ఇప్పటినుండి హైబ్రిడ్ విధానంలో ఆరోగ్య భీమా అందిస్తారని తెలియజేశారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యూరియా కొరతతో రైతులకు తప్పని తిప్పలు

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని రైతులకు యూరియా కొరత వలన తప్పని తిప్పలని రైతులు వాపోయారు ఈ సందర్భంగా సోమవారం ఉదయం రైతు భరోసాల కేంద్ర వద్ద ఉదయం 6 గంటల నుంచి. ఆధార్ కార్డులను చేతపట్టుకొని కిలో నిలబడాల్సి వచ్చింది అన్నారు కూటమి ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని రైతులను ఇబ్బందులు గురి చేయకుండా ఆదుకోవాలని కోరారు. కాస్త కోస్తా వచ్చినటువంటి యూరియా ని తీసుకోవడానికి రావాలంటే కూటమి ప్రభుత్వంలో ఉన్నటువంటి మండలంలో ఉన్నటు వంటి నాయకులతో పెద్ద సమస్యగా ఏర్పడింది రాజకీయ నాయకుల యొక్క అండదండలు ఉండాల్సిన అవసరము అగ్రికల్చర్ ఆఫీసర్ వారు చూసుకుంటారు కూటమి ప్రభుత్వం దయచేసి రైతు సమస్యల మీద స్థానిక నాయకులకు అజమాయేసి తౌలక పోతే బాగుంటుందన్నారు ఇలాంటి వాటి పైన రైతులు చానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అదే విధంగా పెనుమూరు మండలంలో తనకు ఎస్సై వెంకట నరసింహం రైతులను సర్దుబాటు చేసి క్యూలైన్లో నిలబెట్టి ఒక్కొక్కరికే యూరియా మోటో అందజేసినట్లు తెలియజేశారు.

రైతులకు యూరియా, ఇతర ఎరువులు కొరతను తీర్చాలి

విశాలాంధ్ర -తిరుపతి: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం వద్ద యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులు వ్యవసాయ యంత్రాలు పరికరాలు విత్తనాలు పురుగుమందులు రైతులకు విరివిగా అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ మాట్లాడుతూ. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వ నేతలు రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులు విత్తనాలు పురుగుమందులు వ్యవసాయ యంత్రాలు పరికరాలు విరివిగా అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అయితే అధికారానికి వచ్చిన తర్వాత రైతులను ఏమాత్రం పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నది. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో యూరియా కొరతతో రైతులు రాత్రులు పగులు కాసుకుని కూర్చున్న యూరియా దొరకకుండా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ కొరతని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తీర్చాలని చిన్నిరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఎరువుల డీలర్లు అధిక రేట్లకు పక్క రాష్ట్రాలకు తలలు తరలించి అమ్మడం స్టాక్ ఉన్న లేదని కృత్రిమ కొరతను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని ఆయన తెలియజేశారు. ఈ విషయమై వ్యవసాయ కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఉన్న అధికారులు సోదాలు చేసి పరిశీలించి డీలర్లపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే అధికార పార్టీ నాయకులు అండదండలతో పై కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే రాష్ట్రంలో ఉన్న రైతులు ఏ సమయంలో ఏ పంట వేస్తారని ఎలాంటి ఎరువులు అవసరం అవుతాయని అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి ఏరియా కొరత తదితర సమస్యలు రైతులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం (ఏఐ) ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కృత్రిమ మేధోసంపత్తితో వ్యవసాయాన్ని ముందుకు తీసుకొని పోతామని చెబుతున్న ఇంకోవైపున రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేస్తుందని చిన్ని రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయ శెట్టి. సిపిఐ మండల కార్యదర్శి కృష్ణమూర్తి చంద్ర వై దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

టపాసుల వ్యాన్ స్వాధీనం

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలో స్థానిక చెక్పోస్ట్ వద్ద బందోబస్తు నిర్వహిస్తుండగా టపాసు లు వ్యాను ఎటువంటి అనుమతులు లేకుండా రావడంతో అనుమానం వచ్చి ఆపడంతో అందులో ఎటు వంటి బిల్లులు లేకుండా టపాసులు వ్యానును పట్టుకోవడం జరిగిందన్నా రు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్ నరసింహ మాట్లాడుతూ పీలేరు చెందినటువంటి అమర్నాథ్ రెడ్డి కుమారుడైన నవ్య కాంత్ అనే అతను అక్రమంగా 1,60,000 చెందినటువంటి టపాసులను అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో పట్టుకొని వ్యాను అతనిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అతని మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైయస్సార్ పార్టీ బలోపేతం గ్రామ కమిటీలు ఏర్పాటు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని స్థానిక బైసాని కళ్యాణ మండపం నందు నిర్వహించిన వైఎస్ఆర్ పార్టీ బలోపేతం గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్చార్జ్ వజ్రం భాస్కర్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని మహిళా కమిటీ వ్యవసాయ కమిటీ యువజన కమిటీ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అరాచకాల గురించి తెలియజేసి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత మాటలను నమ్మవద్దని అవగాహన కల్పించాలన్నారు. చౌడేపల్లి వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ కొత్తపల్లి చెంగారెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరు సైన్యంలా రావాలని మన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గంలో రోల్ మాడల్ గా తీర్చిదిద్దాలని పుంగనూరు నియోజకవర్గమంటే రాష్ట్రంలోనే ముందుండేలా గుర్తుండేలా అందరూ పార్టీకి బలోపేతానికి కృషి చేయాలని ఆయన అన్నారు తిరిగి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి గా చేయాలని తెలుగుదేశం పార్టీకి డిపాజిట్లు లేకుండా ప్రతి ఒక్కరూ వైయస్సార్ పార్టీకి పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దామోదర్ రాజు మండల అధ్యక్షుడు కొండా మరి నాగభూషణం రెడ్డి ఉపాధ్యక్షుడు జంగాలపల్లి వెంకటరమణ మాజీ ఎంపీపీ అంజిబాబు యువ నాయకుడు కళ్యాణ్ భరత్ మాజీ జెడ్పిటిసి రూపినమ్మ వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి నరసింహ యాదవ్ బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ చౌడేపల్లి వైఎస్ఆర్ పార్టీ నాయకులు పవన్ భాస్కర మంజునాథ్ కాటిపేరు రాంబాబు శ్రీనివాసులు కాగితి సర్పంచ్ షంషీర్ ఏ కొత్తకోట సర్పంచ్ షఫీ మాజీ సింగల్ విండో అధ్యక్షుడు రవిచంద్ర రెడ్డి దుర్గ సముద్రం జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగినేని చెంచయ్య ప్రయత్నాలు ఫలించేనా..?

కిలారీ రాజేష్ కోసం పడిగాపులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రధాన ఆలయాలకు వారం రోజుల్లో పాలక మండళ్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో... శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి కోసం రంగినేని చెంచయ్యనాయుడు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాగైనా మండలి అధ్యక్ష పదవి సాధించుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. అందులో భాగంగానే నారా లోకేష్ కు అత్యంత సన్నిహితుడైన కిలారీ రాజేష్ ను ప్రసన్నం చేసుకోవడానికి రంగినేని చెంచయ్యనాయుడు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. కిలారీ రాజేష్ కోసం ఆయన సుమారు వారం రోజులుగా అమరావతిలో పడిగాపులు కాస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు చెంచయ్యనాయుడుకు కిలారీ రాజేష్ అపాయింట్ మెంటు దొరకలేదు. కిలారీ రాజేష్ ను ప్రసన్నం చేసుకుంటే రంగినేని చెంచయ్యనాయుడుకు మండలి అధ్యక్ష పదవి దక్కినట్లే.ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు. ఇందులో రంగినేని చెంచయ్యనాయుడు పేరు ముందు వరుసలో ఉంది. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కూడా ఈయనకే మద్దతు తెలుపుతున్నారు. చెంచయ్యకే మండలి అధ్యక్ష పదవి అంటూ ఈయన పలు సందర్భాల్లో బహిరంగ ప్రకటన కూడా చేశారు. ఇక మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్ తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఈయనకు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు మద్దతు పుష్కలంగా ఉంది. మరోవైపు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి కూడా ఈ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ తో తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను ఇందుకు ఈయన వినియోగించుకుంటున్నారు. ఇక టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు కూడా మండలి అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు తనకు ఉన్న అన్ని మార్గాలను గాలి చలపతి నాయుడు వినియోగించుకుంటున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి కూడా తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇక బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ మండలి అధ్యక్ష పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జనసేన నుంచి కొట్టే సాయి కూడా తన అదృష్టం పరీక్షించుకోవడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. వినుత కోటా ఓ హత్య కేసులో జైలుకు పోవడంతో కొట్టే సాయి పేరు బయటకు వచ్చింది. ఇలా పలువురు మండలి అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతుండటంతో రంగినేని చెంచయ్యనాయుడు ఆందోళన చెంది కిలారీ రాజేష్ ను ప్రసన్నం చేసుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేల సిఫారసు కాదని... నామినేటడ్ పదవుల కోసం ఎమ్మెల్యేలు సిఫారసు చేస్తుంటారు. కూటమి ప్రభుత్వంలో కూడా ఇదే జరుగుతోంది. అయితే ఈ సిఫారసు లేఖలను టీడీపీ అధినేత చంద్రబాబు నామమాత్రంగా పరిగణిస్తున్నారు. పార్టీలో కష్టపడిన వారికి మాత్రమే పదవులు ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగినేని చెంచయ్యకు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సిఫారసు చేసినా... ఆయనకు ఆందోళన పోవడం లేదు. ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి తనకు దక్కుతుందో... లేదో అనే అనుమానం చెంచయ్యనాయుడును వెంటాడుతోంది. ప్రముఖ ఆలయాలకు వారం రోజుల్లో కమిటీలు నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటన చేయడంతో రంగినేని చెంచయ్యనాయుడు ఆగమేఘాలపై విజయవాడకు వెళ్లారు. అక్కడ కిలారీ రాజేష్ ను ప్రసన్నం చేసుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. కిలారీ రాజేష్ కు పార్టీలో ఏ పదవి లేక పోయినా... నారా లోకేష్ తో ఈయనకు ఉన్న సన్నిహిత సంబంధాలతో ఏపని అయినా జరుగుతోంది. నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా కిలారీ రాజేష్ తో చెంచయ్యనాయుడుకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం గుర్తు చేస్తూ... మండలి అధ్యక్ష పదవికి కిలారీ రాజేష్ నుంచి సిఫారసు చేయించుకోవడానికి చెంచయ్యనాయుడు ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ప్రయత్నం ఫలిస్తుందో... లేదో వేచి చూడాలి. కిలారీ రాజేష్ మనస్ఫూర్తిగా సిఫారసు చేస్తే రంగినేని చెంచయ్య పదవికి ఏమాత్రం ఢోకా లేదు.

పిజిఆర్ఎస్ అర్జీలకు ప్రాధాన్యతతో పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 అర్జీలు : కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పదంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎ స్)లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ మునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిలారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతూ, పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్. శుభం బన్సల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనతరం విబిన్న ప్రతిభావంతుల హిజ్రా, వయోవ్రుద్దుల సంక్షేమ శాఖ ,తిరుపతి వారు సుమారు 50 వేలు రూపాయలు విలువ గల మూడు చక్రముల సైకిల్-3, వీల్ చైర్ -1, చంక కర్రలు 1 జత ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విబిన్న ప్రతిభావంతుల హిజ్రా, వయోవృద్ధులకు, విబిన్న ప్రతిభావంతుల హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులుతో కలసి జిల్లా జా యింట్ కలెక్టర్ శుభం బన్సల్ అందిం చారు. శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ -150, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -8, సర్వే శాఖ -9, పోలీస్ -10, పంచాయతీ రాజ్ -26, విద్యా శాఖ -6, రూరల్ పావర్టీ -2, రూరల్ డెవలప్మెంట్ -2, ఫ్యామిలీ వెల్ఫేర్ -9, జాతీయ రహదారులు -1, ఆర్టీసీ -1, విద్యుత్ -1, ఏపీఎస్ డబ్ల్యూఈఆర్ఐ -1, రిజిస్ట్రేషన్ శాఖ -2, మెడికల్ కాలేజ్ ఎడ్యుకేషన్ -1, ఎక్సైజ్ -1, బిసి వెల్ఫేర్ -1, మైనారిటీ వెల్ఫేర్ -1, ఎంప్లాయిమెంట్ శాఖ -1, గనుల భూగర్భ జలాలు శాఖ -1, హార్టికల్చర్ -2, కో ఆపరేటివ్ సొసైటీస్ -1, ఇరిగేషన్ -1 మొత్తం 238 అర్జీలు రావడం జరిగిందని సంబంధిత అధికా రులు వచ్చిన అర్జీల పై దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పం దనకు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

మహిళలు, బాలికల సాధికారత కోసం

మిషన్ శక్తి - సంకల్ప్ అవగాహన

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: మహిళలు, ఆడపిల్లల సాధికారత పెంపొందించడమే కాకుండా, సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ అన్యాయాలపై అవగాహన కల్పించేందుకు మిషన్ శక్తి కార్యక్రమం నేపథ్యంలో ప్రత్యేక సంకల్ప్ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఐసిడీఎస్ పీడీ వసంత్ బాయి, సీడీపీఓలు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని, 10 రోజుల (సెప్టెంబర్ 2 నుండి 12 వరకు) ప్రత్యేక అవగాహన కార్యక్రమాల క్రమంలో కీలక అంశాలపై చర్చలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ, మిషన్ శక్తి కార్యక్రమంలో అన్ని శాఖల సమన్వయంతో మహిళలు, బాలికల సాధికారత కోసం సంకల్ప్ అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు. కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్‌జిఓలు, మహిళలు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం కోసం మహిళలకి ప్రత్యేక సూచనలు చేశారని తెలిపారు. సంకల్ప కార్యక్రమ ముఖ్యాంశాలు: బేటీ బచావో బేటీ పఢావో. లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం. కార్యాలయాల్లో మహిళల భద్రత. చట్టపరమైన అవగాహన. విద్య, శిక్షణ ద్వారా మహిళల సాధికారత. ఆరోగ్యం, పోషకాహారం. పోక్సో చట్టంపై అవగాహన. స్టీమ్ రంగాల్లో మహిళల ప్రోత్సాహక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ చివరగా ప్రతి మహిళ, బాలిక ఈ అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్వయం సాధికారత సాధించాలన్నది మా ప్రధాన లక్ష్యమని పాఠకులకు పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో డిఎంహెచ్వో బాలకృష్ణ నాయక్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ మంజరి, ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ వాసంతి, రాస్ సీడీపీఓ సుధారాణి, అంగన్వాడీ వర్కర్స్, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, డియుపియు అధికారులు తదితర అధికారులు, సిబ్బంది, కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జిల్లాలో గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

- ఏఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర- చిత్తూరు : జిల్లాలో గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్. నాగరాజు, సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి ఏఐటీయూసీ నగర కార్యదర్శి దాసరి చంద్ర పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు కార్మికులు పంచాయతీల్లో పారిశుద్ధ పనులు చేస్తున్నప్పటికీ గ్రామస్తులకు ఆరోగ్య పరంగా కాపాడుకుంటూ పనులు చేస్తున్నప్పటికీ ప్రతి నెల ఇచ్చే 6000 వేతనాన్ని కూడా పూర్తిస్థాయిలో ప్రభుత్వం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఒక్కొక్క కార్మికుడికి 18నుంచి 25 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు కార్మికులకు జీతాలు ఇప్పించడంలో ప్రభుత్వం సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదన్నారు. జీతాలు ఇవ్వకపోతే ఆ కుటుంబాలు ఏం తిని బతకాలని వాళ్ళ పిల్లల్ని ఏ విధంగా చదివించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలో అభివృద్ధి చేయాలని పంచాయతీల్లో ఎరువులు తయారుచేసి సంపద సృష్టిస్తామని ప్రకటన చేస్తూ ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం కార్మికుల వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చూస్తున్నట్టు చెప్పారు. అందుకు ప్రతి పంచాయతీలో కూడా గ్రీన్ అంబాసిడర్ కార్మికులను పనిలో పెట్టుకుని పంచాయతీ అభివృద్ధి కోసం పనిచేయాలని ప్రకటించేస్తున్నప్పటికీ అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించడంలో గాని, కార్మికుల వేతనాలు చెల్లించడంలో గాని ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉన్నది. కావున గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే గుర్తింపు కార్డు ఇచ్చి కార్మిక కుటుంబాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా డిపిఓ ను పిలిచి కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు పైన పూర్తి స్థాయిలో విచారించి వారికి త్వరలో వేతనాలు మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న వేతనాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని జీతాలు పెట్టిస్తామని పెండింగ్ జీతాలను15 ఫైనాన్స్ నిధులు వచ్చిన లేక జనరల్ పండు నిధులు వచ్చిన వెంటనే మొదట కార్మికుల వేతనాలు చెల్లించి తరువాత ఇతర పంచాయతీ పనులకు వాడుకుంటామని కావున కచ్చితంగా జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర నాయకులు రమాదేవి కవిత బాలాజీ రావు లత గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రన్ గ్రీన్ అంబాసిడర్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, జిల్లా కోశాధికారి రమేష్,జిల్లా నాయకులు ఏసు పాదం,రవి,బాలాజీ,ఇసాక్,దేశప్ప,రవి కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు ఆశయాలను కొనసాగిద్దాం

విశాలాంధ్ర - తిరుపతి : ప్రముఖ ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు సోమవారం తిరుపతి బైరాగి పట్టెడ లోనే సిపిఐ కార్యాలయంలో డాక్టర్ గరికపాటి రాజారావు 62వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పాటల నీరాజనం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ గరికపాటి రాజారావు సమాజంలో పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలు నిరుద్యోగం నిరక్షరాస్యత ఇతర అనేక అంశాల ను రూపుమాపడానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన గరికపాటి రాజారావు ప్రముఖ రచయిత కళాకారుడు దర్శకుడుగా పుట్టిల్లు సినిమాతో అనేకమంది గొప్ప గొప్ప కళాకారులను సినిమా రంగానికి పరిచయం చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దిన గొప్ప కళాకారుడ ని అన్నారు. ప్రజానాట్య మండలి ప్రతి గుండె ప్రతిధ్వని అంటూ సమాజం మేల్కొల్పడానికి ఆయన చేసిన కృషి ఎంతో అమోఘం అన్నారు సినిమా రంగంలో అల్లూరు రామలింగయ్య జానకి నర్రా వెంకటేశ్వరరావు లాంటి ప్రముఖ నటులను తయారు చేశాడని అన్నారు. భారత ప్రభుత్వం గరికపాటి రాజారావు ఫోటో ఉన్న తపాలా బిళ్ళను ముద్రించిన చరిత్ర కలిగిన వ్యక్తి గరికపాటి అన్నారు కళ కళకోసం కాదు కళ ప్రజల కోసం అంటూ సమాజానికి నాటక రంగాన్ని అభ్యుదయ భావాలు కలిగిన ఎన్నో నాటకాలను తయారు చేసి సమాజ మార్పుకు కృషి చేసిన ప్రజా వైద్యుడు అని అన్నారు డాక్టర్ గరికపాటి రాజారావు ఆశయాలను ఆలోచనలను ముందుకు తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ చేస్తుందని అందులో ప్రజా కళాకారులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాధాకృష్ణ ప్రజానాట్యమండలి జిల్లా కోశాధికారి బి నాగభూషణం వివిధ ప్రజా సంఘాల నాయకులు వి ఉదయ్ కుమార్ ప్రవీణ్‌నవీన్‌మంజుల మహేంద్ర జనార్దన్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి పురం పార్కులో నాసిరకం పనులు

- 1లక్షతో సూచిక బోర్డ్, జిమ్ ఊసేలేదు
- పిల్లల పార్క్‌లో పాతవస్తువులకు రంగులు
- పిజిఆర్ఎస్‌లో కమిషనర్‌కు పిర్యాదు
- స్వతహాగా పరిశీలిస్తామని హామీ..

విశాలాంధ్ర - తిరుపతి : బైరాగి పట్టెడ పద్మావతి పార్కులో కార్పొరేషన్ నిధులతో జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల్లో పూర్తి డొల్లతనం కనబడు తోందని సత్వరం పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని వాకర్స్ అసోసియే షన్ సభ్యులు కమిషనర్కు వినతి పత్రం అందజేశారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బైరాగి పట్టెడ వాసులు, వాకర్స్ అసోషియేషన్ సభ్యులు డాక్టర్ టి. జనార్ధన్ రాజారెడ్డి, రామచంద్రయ్య ల ఆధ్వర్యంలో పద్మావతి పార్కు అభివృద్ధి పనుల్లో జరిగే నాణ్యతా లోపాలను కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 15 లక్షల వ్యయం తో జరుగు తున్న పనులు ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, నాసిం కంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్ కు ?5 లక్షలు, జిమ్ కు రూ.5 లక్షలు పేర్కొన్నారని, నేడు ట్రాక్ అద్వానంగా వేస్తున్నారని, జిమ్ ఊసే లేదని వారు వాపోయారు., ప్రధాన గేటు వద్ద ఉన్న సూచిక బోర్డు రూ.1లక్ష చూపించి, పాత బోర్డుకే రంగులు వేయించారని పేర్కొన్నారు,. కనుక ప్రజల స్వేద తీర్చే, పిల్లలు, ఆటలు, ఆహ్లాదం, కోసం, ఖర్చు చేస్తున్న నిధులు పక్క దారి పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కమిషనర్ ఈ సందర్భంగా సత్వరం పార్కులో జరిగే అభివృద్ధి పనులు స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బైరాగి పట్టిన వాకర్స్,గోపాలకృష్ణ ఎం. రవి కుమార్,పి.దేవదత్త, ఇరికిసుబ్బారెడ్డి ,జనార్దన్‌రెడ్డితదితరులుపాల్గొన్నారు.